క్లుప్తంగా

రోడ్డు వేయాలని నాటువేసి నిరసన


నాటేసి నిరసన తెలుపుతున్న యువకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి గ్రామానికి వచ్చే రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రోడ్డుపై గ్రామ యువకులు నాటు వేసి నిరసన తెలిపారు. రోడ్డును బాగుచేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, వెంటనే రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు వేల్పుల రాజేశ్, పోతుకంటి శ్యాంసుందర్, అజిత్, వినోద్, సాగర్, ప్రేమ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్డీవో

జగిత్యాల: వృద్ధులైన కన్న తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకెళ్లాల్సి ఉంటుందని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో పలు కేసులను విచారించారు. ఈ సందర్భంగా సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన గంగవ్వ, ఎండపల్లి మండలం అంబారిపేటకు చెందిన భూమలింగం న్యాయం చేయాలని ట్రిబ్యునల్ చైర్మన్‌కు ఫిర్యాదు చేయగా వారిని విచారించారు. తల్లిదండ్రులను పోషించకపోతే చట్టప్రకారం జైలుశిక్ష పడుతుందని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో తఫజిన్ హుస్సేన్, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న అధికారులు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో శనివారం మన్నెగూడెం ఏఈ రాంమోహన్‌రావు గ్రామస్తులు, రైతులు, నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్‌కి అనువైన స్థలాన్ని గ్రామస్తులు నాలుగు చోట్ల చూపించగా, పై అధికారులతో చర్చించి త్వరతోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. చాలా కాలం తర్వాత సబ్‌స్టేషన్ మంజూరు అవుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం తగదు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో

కోరుట్ల రూరల్: పన్నుల వసూళ్లలో అలసత్వం తగదని మండల పంచాయతీ అధికారి కృపాకర్ అన్నారు. మండలంలోని జోగిన్‌పెల్లిలో శనివారం శానిటేషన్ పనులు పరిశీలించి అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. పన్నులు సక్రమంగా వసూలు చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సులు, గృహ నిర్మాణాల మ్యూటేషన్లు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు పొందాలన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హకీం, కారోబర్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కంప్యూటర్లు దగ్ధం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని బీర్‌పూర్ సింగిల్‌విండో కార్యాలయం సమీపంలో పిడుగువేయడంతో సింగిల్‌విండో కార్యాలయంలోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. కార్యాలయ సమీపంలోని ఇళ్లలో ఫ్యాన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సమీపంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ సైతం కాలిపోయింది. సింగిల్‌విండో కార్యాలయంలో పిడుగుపాటుతో కాలిపోయిన వస్తువుల విలువ రూ. 50 వేలు ఉంటుందని సొసైటీ సీఈవో అయ్యోరి తిరుపతి తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/మెట్‌పల్లిరూరల్/రాయికల్/మల్యాల/మల్లాపూర్/కథలాపూర్/పెగడపల్లి/బుగ్గారం: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం ముందస్తుగా రాఖీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈసందర్భగా విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు రాఖీ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.
కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసంధర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు కలెక్టర్, తహసీల్దార్, సీఐ, ఎస్ఐ,ఎంపీఐలకు రాఖీలు కట్టారు.


బొమ్మెన ప్రభుత్వ పాఠశాలలో రాఖీ వేడుకల్లో విద్యార్థులు


బుగ్గారం: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు


కోరుట్ల మండలం జోగిన్‌పల్లి పాఠశాలలో..


రాయకల్ మండలం మైతాపూర్ పాఠశాలలో..


చిట్టాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో రాఖీ వేడుకలు


జగిత్యాల మండలం అంతర్గాం పాఠశాలలో..


మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి పాఠశాలలో..

కళాశాల మరమ్మతు త్వరగా పూర్తిచేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పట్టణంలోని సంస్కృతాంధ్ర ఓరియంటల్ కళాశాలలో మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సంస్కృత కళాశాల పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న క్రమంలో అడ్లూరి శనివారం కళాశాలను అధికారులతో కలిసి సందర్శించారు. కళాశాలలో తరగతి గదులు, బాత్‌రూంలు, తాగునీరు, విద్యార్థులకు కావాల్సిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు. గోదావరిలో భక్తుల ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేష్, వేములు రాజు, చీపిరిశెట్టి రాజేశ్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ తదితరులున్నారు.


గోదావరిని పరిశీలిస్తున్న విప్, అధికారులు

సీఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన నలుగురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్‌ఫండ్ పేదల పాలిట వరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల రామ్‌కుమార్, దుమాల తిరుపతి, సుశీల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు
రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కడకుంట్ల నరేశ్, చౌడారపు లక్ష్మీనారాయణ శనివారం కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోరహన్మండ్లు, సింగిల్ విండోచైర్మన్ ఏనుగు మల్లారెడ్డి పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

గ్రామ పంచాయతీల ఏర్పాటుపై సంబరాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళ శివారు తండా గొండుగూడెం, నర్సింహులపల్లె శివారు గ్రామం ఇందిరానగర్‌లను ప్రభుత్వం నూతన పంచాయతీలుగా ప్రకటించింది. శనివారం ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విలేకరులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొండుగూడెం, ఇందిరానగర్‌లు 2018 నూతన గ్రామపంచాయతీ చట్టం ప్రకారం ప్రభుత్వం రాజపత్రాన్ని (గెజిట్)ను విడుదల చేసిందన్నారు. గ్రామపంచాయతీల ఏర్పాటు సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామాలు నూతన గ్రామపంచాయతీలు గా ఏర్పడడంతో గొండుగూడెం, ఇందిరానగర్ గ్రామాల ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. మంగేళ గొండుగూడెంలో 394 జనాభా ఉండగా, పురుషులు 186 మంది, స్త్రీలు 208 మంది ఉన్నారు. ఇక్కడ మొత్తం కుటుంబాల సంఖ్య 98, ఓటర్ల సంఖ్య 264 మంది. ఇది పూర్తిగా గిరిజనలో గొండు తెగవారు ఇక్కడ నివసిస్తున్నారు. మరో గ్రామపంచాయతీ ఇందిరానగర్‌లో మొత్తం దళితులు నివసిస్తున్నారు.


సంబరాలు జరుపుకుంటున్న గొండుగూడెం వాసులు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆసుపత్రిని శనివారం ఆయన సందర్శించారు. ప్రతినెలా నమోదవుతున్న ప్రసవాల సంఖ్య గురించి తెలుసుకొని.. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. జ్వరాల పరిస్థితిపైనా ఆరా తీశారు. డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

'రుణమాఫీ పేరిట కాంగ్రెస్ కొత్త నాటకం'

కథలాపూర్: రైతులకు పంటల రుణం రూ.2 లక్షలు మాఫీ చేస్తామని నెలల తరబడిగా ప్రకటనలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి మండిపడ్డారు. శనివారం కథలాపూర్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో 46 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే.. మూడు విడతల్లో కేవలం 20 లక్షల మందికి రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి సంబరపడిపోతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గడువులోగా రుణమాఫీ చేయడం చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావును రాజీనామా కోరే హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు కల్లెడ శంకర్, నాగేశ్వర్ రావు, గుండారపు గంగాధర్, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసకారి ప్రభుత్వం

మెట్‌పల్లిరూరల్: రుణమాఫీ విషయంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండల బీజేపీ నాయకులు శనివారం మాట్లాడారు. ఎన్నికల ముందు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించి కొందరికే మాఫీ చేయడం సరికాదని మండిపడ్డారు. సాంకేతిక సమస్యలంటూ బ్యాంకులను సాకుగా చూపుతూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వం,షరతులు లేకుండా వెంటనే అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజేందర్,నాయకులు జనార్దన్, శ్రీధర్, మహేశ్,తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మేడిపల్లి: భీమారం మండలంలోని ఒడ్యాడ్ గ్రామానికి చెందిన పల్లెపు వెంకటికి విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దువ్వాస గంగాధర్, ప్రధాన కార్యదర్శి పుట్ట రాజేందర్, సురకంటి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు


ఐఏఎస్ దంపతులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ముత్యాల రాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయం పక్షాన మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈవో శ్రీనివాస్ వారికి స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వేద పండితులు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

అభివృద్ధి పనులపై ప్రభుత్వ విప్‌కు వినతి


విప్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్ ఆది శ్రీనివాస్ కలిసి పలు అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేశారు. భీమారం మండల కేంద్రంలోని మాల సంఘానికి భవనం కావాలని కోరగా మంజూరు చేశారు. మన్నెగూడెంలో పీఏసీఎస్ సెంటర్, దేశాయిపేటలో ఎరువుల గోదాం కావాలని వినతిపత్రం అందించారు. అధికారులతో చర్చించి త్వరగా పనులు అయ్యేలాగా కృషిచేస్తానని తెలిపినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నీరటి మల్లేశం, చెక్కపల్లి సంజీవ్, నర్సింగరావు, చెక్కపల్లి శంకర్, జగన్‌రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 14 ర్యాంక్ సాధించిన బాస గంగోత్రిని శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో చదువుకుని వృక్షశాస్త్రంలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, మల్లారం శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, స్వరూపరాణి, పడాల తిరుపతి, శ్రీలత, జ్యోత్స్న, జమున పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న రెడ్డి సంఘం ఎన్నికలు

జగిత్యాలరూరల్: సెప్టెంబర్ 1న రెడ్డి సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో శనివారం రెడ్డి సంఘ సమావేశం నిర్వహించారు. సంఘాన్ని బలోపేతానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి, కోశాధికారి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, నిశాంత్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భోజారెడ్డి, గౌతమ్‌రెడ్డి, భూమారెడ్డిపాల్గొన్నారు.

సెంట్రల్ ముస్లిం ఎలక్షన్ కమిటీ సభ్యునికి ఎస్పీ అభినందన
జగిత్యాలరూరల్: జగిత్యాల సెంట్రల్ ముస్లిం ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యక్ష ఎన్నికల్లో ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన షహెరాజ్ ఉద్దీన్ మాసిక్‌ను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ శనివారం అభినందించారు.



పెగడపల్లి: మండలంలోని దోమలకుంటలో అంగన్‌వాడీ కేంద్రం భవనం అసంపూర్తిగా ఉంది. ఆరేళ్ల క్రితం రూ. 5 లక్షల నిధులు పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనంలో స్లాబ్, గోడల వరకు పనులు జరిగాయి. భవనం లోపల ఫ్లోరింగ్, తలుపులు, పేయింటింగ్, ఇతరత్రా పనులు చేయాల్సి ఉంది. మిగులు పనులు పూర్తి చేయించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. భవనం నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంషేర్ అలీ, పీఆర్ ఏఈ, ఫోన్ నంబర్: 9849365471

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత
జగిత్యాలరూరల్: మండలంలోని కల్లెడ, పోరండ్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. కల్లెడ, తక్కళ్లపల్లి, సంగంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్, అనంతారం, గుత్రాజ్‌పల్లి, పోరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం
జగిత్యాల: జాతీయ స్కాలర్‌షిప్ వేతనం కోసం 2024–25 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9–10 తరగతుల వారికి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఇంటర్ నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేట్ వారికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ వారికి టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్‌లు అందించబడుతాయని తెలిపారు. www.depwd.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దీన్‌దయాళ్ వికలాంగ పునరావాస పథకానికి
జగిత్యాల: మత్తుకు అలవాటు పడిన వారికి కేంద్రప్రభుత్వ దీన్‌దయాళ్ వికలాంగ పునరావాస పథకం ద్వారా పునరావాసం కల్పించే ప్రభుత్వేతర, వృద్ధాశ్రమాలు నిర్వహించే ప్రభుత్వేతర సంస్థలు మరిన్ని సేవల కోసం నిధులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఆసక్తిగల వారు అన్ని ధ్రువీకరణ పత్రాలతో జిల్లాలోని వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో వచ్చేనెల 16లోపు సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ శనివారం ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల ఎస్సై కిరణ్‌కుమార్‌ను ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. డీఎస్బీ ఎస్సై ఎస్.శ్రీకాంత్‌ను కోరుట్ల ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాయికల్ స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్

రాయికల్: రాయికల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఆర్డీవో సంపత్‌రావును నియమించగా ఆయన ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అడిషనల్ కలెక్టర్‌ను నియమిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

మెట్‌పల్లి వ్యవసాయధికారిగా దీపిక
మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారిగా దీపిక నియమితులయ్యారు. మెట్‌పల్లి వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు.ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన షాహిద్‌అలీ మేడిపల్లికి బదిలీ అయ్యారు.బదిలీపై మెట్‌పల్లికి వచ్చిన దీపిక ఇప్పటివరకు ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయాధికారిగా పనిచేశారు.

ఇబ్రహీంపట్నం ఏవోగా రాజుకుమార్
ఇబ్రహీంపట్నం: మండల వ్యవసాయ అధికారిగా రాజుకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏవో దీపిక మెట్‌పల్లికి బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ జిల్లా నుంచి రాజుకుమార్ బదిలీపై ఇబ్రహీంపట్నంకు శనివారం వచ్చి విధుల్లో చేరారు.

టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు
సారంగాపూర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) బీర్‌పూర్ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడుగు మదుసూధన్, ప్రధానకార్యదర్శిగా కదారి ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా జి. సుజాత, జి. చుక్కయ్య , కార్యదర్శులుగా డి. సత్యనారయణ పి శ్రీలత, ఏ పద్మ, జిల్లా కౌన్సిలర్లుగా సిర్ప నాగభూషణం, ఎడ్ల గోవర్ధన్,ఆర్మూరి భీమరాజం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాచమల్ల మహేశ్ వ్యవహరించారు.

రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దు
మేడిపల్లి: ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని మేడిపల్లి మండల వ్యవసాయ అధికారులు చంద్ర దీపక్, సురేందర్ నాయక్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను లోన్‌ఆప్ ద్వారా రైతుల ముందే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. మార్గదర్శకాలు రాగానే గ్రామాల్లో పర్యటిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

హరీశ్ రావు క్యాంపు ఆఫీస్‌పై దాడి హేయం
సారంగాపూర్: మాజీ మంత్రి హరీశ్ రావు క్యాంప్ ఆఫీస్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ జెడ్పీటీసీ, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు కొల్ముల రమణ అన్నారు. శనివారం సారంగాపూర్‌లో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు ప్రజల పక్షాన నిలబడాల్సి ఉంటుందన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మరిచిపోయారన్నారు. క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సింగిల్‌విండో చైర్మన్ సాగి సత్యంరావు, నాయకులు నేరెళ్ల సుమన్, రవీందర్, తేలు రాజు, బల్మూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
మెట్‌పల్లి: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిని హత్య చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌ల మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, పలు పార్టీల నాయకులు, న్యాయవాదులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

కెనాల్లో పిచ్చిమొక్కల తొలగింపు
ధర్మపురి: మండలంలోని నేరెళ్లలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో కెనాల్లో పిచ్చిమొక్కలతో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు, గంగపుత్ర కాలనీవాసులు శనివారం కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి జాజాల రమేశ్‌కు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడగా పంచాయతీ కార్యదర్శి నరేశ్, కారోబర్ పోతు రమేశ్ దగ్గరుండి కెనాల్లో పేరుకు పోయిన పిచ్చిమొక్కలను జేసీబీ తొలగింపజేసి వరద నీరు వెళ్లడానికి ఏర్పాటు చేశారు.